# నేస్తమా...

### గొర్తిగింతల నాగవరప్రసాద్



ఒలియా...ఒలియా... రావేలు గలవాడా... దూరంగా పడవల మీద వెళ్ళే జాలరుల పాట వినసొంపుగా ఉంది. ఖూలీల అరుపులు గాలి వీస్తుంటే తెరలు తెరలుగా వినిపిస్తున్నాయి. వరిపైరుల నుంచి వచ్చేగాలి నాసికా పుటాలకు తగిలి మనసులో ఏదో అనుభూతిని కలిగిస్తున్నాయి. రెల్లుగడ్డి పొదలు గాలికి అటు ఇటూ కదులుతూ గుసగుసలాడుతున్నాయి. నాగమల్లి చెట్టు పూలు మీద పడి చిన్న నాటి సంగతులను మధురంగా చెబుతున్నాయి. ఏదో తెలియని ప్రశాంతత మనసును ఆహ్లాదపరుస్తుంది. తదేకంగా ప్రకృతిని ఆస్వాదిస్తున్న నాకు ఒక్కసారిగా గతం కళ్ళముందు కదలాడింది.

⁕ ⁕ ⁕

గోపాల్ నేను మంచి స్నేహితులం. వేసవి కాలం కావడం వలన బడి త్వరగా వదిలారు. గోపాల్ గురించి వెతుకుతున్న నాకు దూరంగా పచ్చగడ్డి మీద కూర్చుని గులకరాళ్ళు నీటిలోకి విసురుతూ కనిపించాడు. దగ్గరకు వెళుతూనే "ఈ రోజు బడికి రాలేదేం?" కొంచెం ఆశ్చర్యం నిండిన కంఠంతో అడిగాను.

"నాకెందుకో బడికి వెళ్ళాలనిపించడం లేదు, ఇక్కడే కూర్చుని ప్రశాంతమైన గాలి శబ్దం వింటూ ఎండిన ఈ చేలను, వాటిలో ఒడ్ల గింజలను ఏరుకు తినే ఈ పక్షులను చూస్తూ ఎంత కాలమైనా ఇలాగే ఉండిపోవాలనిపిస్తుంది." వాడు చెప్పిన సమాధానానికి కాస్తంత నవ్వు వచ్చినా నన్ను నేను సమర్దించుకుని "నీ మనస్తత్వం ఏమిటో నాకు అర్థం కాదు గాని, పద వెళదాం" అన్నాను..

"ఎక్కడికి?"

రాయుడిగారి పొలంలోకి, అక్కడ చెట్ల నిండా మామిడి కాయలేనంట. రా వెళదాం" ఇద్దరం కలిసి రాయుడి గారి పొలంలోకి వెళ్ళాం. మిట్ట మధ్యాహ్నం అందులోనూ వేసవి కావడం వలన రాయుడు గారి పొలం చాలా నిశ్శబ్దంగా వుంది.

⁕ ⁕ ⁕

ఒకటి, రెండు...తొమ్మిది లెక్క పెట్టడం పూర్తి చేశాను. అందులో ఒకటి తను తీసుకుని మిగతావి నన్ను తీసుకోమన్నట్లుగా సైగ చేశాడు. కాదు ఇద్దరం చెరి సగం తీసుకుందాం అన్నాను. కానీ విన లేదు. మొదట్నుంచీ గోపాల్ మనస్తత్వం ఏంటో నాకు అర్థమయ్యేది కాదు. అదే మాట గోపాల్‌తో అన్నాను. దానిని వాడు క్షణం ఆలోచించి నాకు 'నిస్వార్థంగా జీవించాలని వుంది' అన్నాడు.

"నిస్వార్థం అంటే?" వాడి సమాధానం పూర్తి కాకుండానే మధ్యలోనే అడిగాను.

"నిస్వార్థం అంటే..." అని కొద్ది సేపు ఆలోచించి ఏదో గుర్తుకు వచ్చినట్లు తన చూపుడు వేలుతో అటు చూడమన్నట్లుగా సైగ చేశాడు. వాడు చూపిన వైపు చూశాను. అక్కడ ఇద్దరు పిల్లలు ఒక బంతి గురించి కొట్టుకుంటున్నారు. అందులో ఒకడు ఆ బంతి నాదంటే ఇంకొకడు కాదు అది నాది అంటూ కొట్టుకుంటున్నారు. వాళ్ళను చూసిన నాకు గోపాల్ వారిని నాకెందుకు చూపించాడో అర్థం కాలేదు. ఇంతలో గోపాల్ అన్నాడు "ఆ బంతిని వాళ్ళిద్దరూ నాది ,నాది అనుకునే బదులు ఈ బంతి మనది అని అనుకుంటే ఎలా ఉంటుంది? ఇక్కడ నాది అనేది స్వార్థం అవుతుంది. మనది-అనేది నిస్వార్థం అవుతుంది..."చెప్పడం ఆపు చేసి నా వైపు చూశాడు. నా మొహంలో ఏ భావము లేకుండా స్థాణువై నిల్చున్నాను. కొంత కాలం గడిచింది. ఒకరోజు గోపాల్ నా దగ్గరకు వచ్చాడు. వాడి కళ్ళల్లో నీరు...చూడగానే అడిగాను ఏమయ్యిందని?

"నీతో చాలా ప్రశాంతంగా మాట్లాడాలి ఏటి దగ్గరకు రాగలవా?" అన్నాడు. అలాగే అంటూ అతనితో నడిచాను.

ఏరు చాలా ప్రశాంతంగా వుంది. ప్రక్కనే వున్న చేల నుంచి వర్ణించడానికి వీలు

కాపలుపంటి మధురమైన సువాసన మనసును ఆహ్లాదపరుస్తుంటే, నిశ్శబ్దాన్ని చీలుస్తూ అడిగాను "ఏమయ్యిందిరా...?" అని. వాడు చెప్పడం ప్రారంభించాడు.

"పట్నం నుంచి మా పెద్ద నాన్న వచ్చారు."

"వస్తే!" కొంచెం అర్థం కానట్లుగా అన్నాను.

క్షణం ఆలోచించి..."రాత్రి పట్నం నుంచి మా పెద నాన్న వచ్చారు. రేపు నన్ను తనతో పట్నం తీసుకెళతారట."

"ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాను.

"పట్నంలో ఆయనకు తెలిసిన స్నేహితుడి ఆఫీసులో ఏదో ఉద్యోగం ఉందంట. ఈ పల్లెలో ఏముంది? అక్కడకు వస్తే నాలుగు రాళ్ళు వెనకేసుకోవచ్చు అంటూ రాత్రికి రాత్రి వచ్చి బట్టలు సర్దుకో. ఈ రోజు రాత్రికి వెళదాం అన్నారు."

"మరి దానికి నువ్వేమన్నావ్?" కాస్తంత బాధతో అన్నాను.

"నేను రానంటున్నా వినడం లేదు."

"మరి మీ అమ్మా నాన్నా!"

"కొంత కాలం చేస్తే పర్మినెంట్ అవుతుందట. ఆ తరువాత అమ్మ నాన్న కూడా పట్నం వచ్చి మనతోటే ఉంటారు అన్నారు."

కొద్ది సేపు ఇద్దరి మధ్యా నిశ్శబ్దం.

నేనే తేరుకుని అన్నాను. మరి వెళ్ళొచ్చుగా...

మౌనంగా నావైపు చూశాడు. వాడి మొహంలో ఏ భావమూ లేదు.

"నా మనస్తత్వం తెలిసిన నువ్వు కూడా ఇలా అంటే ఎలారా? పట్నంలోకి వెళ్ళాలంటేనే ఏదోలా ఉంటుంది. ఇక్కడ చూడు ఎంత ప్రశాంతంగా ఉందో! చిన్నప్పట్నుంచి ఈ చెట్టు దగ్గరేగా ఆడుకునేవాళ్ళం. అటు చూడు ఆ గడ్డిపూలు ఎంత అందంగా పలుకరిస్తున్నాయో! అదిగో...మనం చదివిన బడి చూడు మనవైపు ఎంత నిశ్చలంగా చూస్తుందో...రా! అందులోకి వెళదాం" అంటూ బడివైపు కదిలాడు..

* * *

బడి మూసేసి చాలా కాలం అయ్యింది. తుఫానుకు పడిపోయిన గోడలు ఇంకా అలానే ఉన్నాయి. ఎదురుగా నల్లబోర్డు. ఇవ్వన్నీ చూస్తుంటే మనసు పొరల్లో ఎక్కడో తియ్యటి బాధ...మేము చదివిన క్లాసులోకి అడుగు పెట్టాము. గతం తాలూకు అనుభూతి ఒక్కసారిగా మనసును పలకరించింది...

ఎదురుగా లెక్కలు చెబుతూ ఎక్కం చెప్పలేదని దండిస్తున్న మాధవరావు మాస్టారు, నేను, గోపాల్, రాము,రాజీ...ఒక్కొక్కరు గుర్తుకు రాసాగారు. బడి వదలగానే అందరం చేలగట్లలో దిగి పరిగె వేరుకుంటున్నట్లు, రాయుడి గారి పొలంలో పాలేరును ఏడిపిస్తున్నట్లు, మామిడికాయలు దొంగతనంగా కోస్తున్నట్లు, చెరువు గట్ల వెంట పరుగులెత్తినట్లు...ఇలా ఒక్కొక్క తీపి అనుభూతి గుర్తుకు వస్తూ మనసును ఎక్కడికో తీసుకువెళుతున్నాయి.

ఆలోచనల్లోంచి తేరుకుని..."పద వెళదాం" అన్నాను. ఇద్దరం కలిసి బయటకు నడిచాము.

* * *

రోజులు నిమిషాల్లా గడిచిపోయాయి. చూస్తుండగానే పది సంవత్సరాల కాలం గిర్రున తిరిగిపోయింది. గోపాల్ పట్నం నుంచి ఉత్తరాలు రాస్తుండేవాడు. వాడు రాసే ప్రతి ఉత్తరంలోనూ బడి గురించి, వరి పైరులను గురించి...రాస్తూ ఉండేవాడు.

"పోస్ట్...!"

బయట కేక వినబడడంతో వెళ్ళాను. పోస్ట్‌మాన్ నుంచి కవరు అందుకుని చదివాను. అందులో గోపాల్ రేపు ఇక్కడకు వస్తున్నట్లుగా రాశాడు. చిన్న నాటి స్నేహితుడిని కలుసుకుంటున్నందుకు మనసులో ఏదో తెలియని అనుభూతిని పొందాను.

* * *

ఉదయం ఆరుగంటలవుతోంది. మనసు ఆనందంతో ఉరకలేస్తోంది. నాకెందుకో ఒకసారి ఏటి గట్టు దగ్గరకు వెళ్ళి అక్కడున్న వరి పైరులతో చెప్పాలనిపించింది. ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా వెంటనే వెళ్ళాను.

ఏరు చాలా ప్రశాంతంగా వుంది. గాలికి నాగమల్లి చెట్టు పూలు క్రిందకు పడుతున్నాయి. ఒక్కసారి గట్టిగా అరిచాను. నా అరుపులో అమితమైన సంతోషం...

టైం చూశాను. అరున్నర కావస్తోంది. పట్నం నుంచి బస్సు గోపాలపురం వరకు మాత్రమే వస్తుంది. గోపాలపురం నుంచి ఇక్కడకు రావడానికి సుమారు నాలుగు గంటలు పడుతుంది. అదీగాక గోపాల పురం నుంచి ఇక్కడకు రావడానికి ఎడ్లబండి మీదనే రావాలి. ఇలా ఆలోచిస్తున్న నాకు మనసులో ఒక ఆలోచన కలిగింది.


* * *

గోపాలపురంలో దిగి బస్టాండులోకి నడిచాను. సమయం మూడు గంటలు కావస్తోంది. పట్నం నుంచి బస్సు ఎన్ని గంటలకు వస్తుంది? అటువైపు వెళ్తున్న ఓ కూలీని అడిగాను. అతడు నా వైపు చూసి, "పట్న నుంచి ఈ రోజు ఏ బస్సు ఇక్కడకు రాదు" అంటూ సమాధానం చెప్పుకుంటూ వెళ్ళిపోతున్న అతనిని పట్టుకుని అడిగాను-"ఏం?"

"ఇయ్యాల పొద్దున మన మంత్రిగోరయిన రాజారెడ్డిని ఎవరో బాంబులతో సంపేసినారంట. అంచేత ఆయన పార్టీ కార్యకర్తలు బందు సేత్తన్నారు..." అంటూ నా వైపు తిరిగి "ఏం? పట్నం నుంచి మీ బంధువులెవరైనా రావాలా?

"ఆ...అవును, పట్నం నుంచి నా మిత్రుడు రావాలి. ఇపుడెలా..." అర్థంగాక అయోమయంగా అడిగాను.

అతను కొద్దిసేపు ఆలోచించి, ఏదో గుర్తుకు వచ్చినట్లుగా...





## సొనాలి ఆశ

సొనాలి బింద్రే కృష్ణవంశీ దర్శకత్వంలో నటించిన 'మురారి' హిట్ అవడంతో తెలుగులో ఛాన్స్‌లను కొట్టేస్తోంది. నాగార్జునతో మన్మధుడు, కృష్ణవంశీ దర్శకత్వంలో రూపొందుతున్న మరో చిత్రం 'ఖడ్గం'లో నటిస్తోంది. తెలుగులో అవకాశాలను కల్పించి ప్రోత్సహిస్తున్న కృష్ణవంశీపై అభిమానంతో తాను సొంతంగా నిర్మిస్తున్న చిత్రానికి దర్శకత్వం వహించమని అడిగింది. తన అభిమాన హీరోయిన్ కోరికను కృష్ణవంశీ కాదనలేడు కదా. హిందీలో తనను చక్కగా ప్రమోట్ చేసి బాలీవుడ్‌లో కూడా స్థానాన్ని నిలబెట్టుకునేందుకు సహకరిస్తాడని సొనాలి ఆశిస్తోంది. ఆమె ఆశ నెరవేరుతుందో లేదో తెలియాలంటే సినిమా విడుదలయ్యేవరకూ చూడాల్సిందే.

"ఒక బస్సు పట్నం నుంచి రామవరంలో ఆగిపోయింది. మీకు అంతగా వెళ్ళాలని ఉంటే రామవరం దాకా ఓ పాలి ఎళ్ళి రండి" అంటూ వెళ్ళిపోయాడు.

మనసంతా దిగులుతో నిండిపోయింది. గోపాల్‌ను త్వరగా కలుసుకోవాలనే ఉద్దేశ్యంతో మా ఊరు నుంచి గోపాలపురం వచ్చాను. నేను ఎంత త్వరగా కలుసుకోవాలనుకుంటున్నానో అది అంత వెనక్కి వెళ్ళిపోతుంది...ఇక్కడ నుంచి రామాపురం తొమ్మిది మైళ్ళు ఉంటుంది. ఇపుడెలా అని ఆలోచిస్తూ...చుట్టూ చూశాను. రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది. మనసులో ఒక నిర్ణయానికొచ్చి, రామాపురానికి బయలుదేరాను.

✳ ✳ ✳

రోడ్డంతా కిక్కిరిసిన జనంతో కిటకిటలాడుతోంది. కొందరు యువకులు చూడ్డానికి బాగా చదువుకున్నట్లున్నారు. వాళ్ళు చేతులతో ఏవో కర్రలు పట్టుకుని షాపులకుండే అద్దాలను పగులగొడుతున్నారు. ఎటు చూసినా రౌడీయిజం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. అన్ని వాహనాలు వెతుక్కుంటూ వెళ్తున్న నాకు దూరంగా ఉన్న ఓ బస్సులోంచి మనుషులు దిగుతుండడం చూసి పరుగులాంటి నడకతో అక్కడికి వెళ్ళాను...

✳ ✳ ✳

బస్సు చుట్టూ జనం మూగారు. ఇంకా బస్సులోంచి కొంతమంది దిగుతూ వున్నారు...ఈలోగా నా ప్రక్కనుంచి ఎవడిదో గొంతు "ఇంకెంత సేపురా? త్వరగా కానీయండి" అంటూ బస్సు ద్వారానికి బయట గొళ్ళెం పెట్టాడు. అంతే...చుట్టూ వున్న కొంతమంది తమ చేతుల్లో ఉన్న డబ్బాలను బస్సుపై కుమ్మరించారు. మొదట్లో నాకు అర్థం కాకపోయినా, తరువాత తెలిసింది అది పెట్రోలు అని...

"ఊఁ అంటించండి" ఎవరో గద్దించారు. అంతే...చూస్తుండగానే మంటలు ఆకాశన్నంటాయి.

అప్పుడు...సరిగ్గా అప్పుడు...ఆకాశం బద్దలయ్యేలా ఓ అరుపు...

ఎక్కడ నుంచి చుట్టూ చూశాను...అం..తే...

వెయ్యివోల్టుల కరెంటు షాకు తగిలినట్లు, క్రింద భూమి బద్దలై నేను అందులోకి కూరుకుపోతున్నట్లు, ఈ ప్రపంచమంతా స్థంభించినట్లు.

ఎదురుగా...నాకెదురుగా...బస్సులోంచి...

గోపాల్ అరుస్తున్నాడు...ఎటు చూసినా మంటలు...మంటలు...వాటి మధ్యలో గో...పా...ల్.

బస్సు తగలబెట్టిన వాడి కాళ్ళ మీద పడ్డాను. "నా మిత్రుడు, నా ప్రాణ మిత్రుడు లోపల ఉండిపోయాడు. దయచేసి రక్షించండి" అని వేడుకున్నాను...

వాడు నన్ను చూసి నవ్వాడు. మిగతా వారు కూడా వాడితో శ్రుతి కలిపారు. మంటల్లోకి వెళ్ళబోయాను. వెళ్తున్న నన్ను కొంతమంది గట్టిగా పట్టుకున్నారు. నా శక్తి ఉన్నంత మేరకు ప్రయత్నించాను. కానీ అప్పటికే మంటలు బస్సును దహించి వేస్తున్నాయి. నేను అరుస్తూనే వున్నాను. అలా అరుస్తూ, అ...రు...స్తూ...మెదడంతా మొద్దుబారిపోయింది. ఎవరో నన్ను బలవంతంగా మంటలకు దూరంగా లాక్కెళుతున్నట్లు లీలగా గుర్తుంది.

✳ ✳ ✳

ఆలోచన పొరల్లోంచి తేరుకుని నెమ్మదిగా పైకి లేచాను. ఒక్కసారి చుట్టూ చూశాను. పరిసరాలన్నీ చాలా మౌనంగా వున్నాయి. వరి పైరులు గాలికి అటూ ఇటూ కదులుతూనే వున్నాయి. ఏరు వంక చూశాను. అది ప్రవహిస్తూనే వుంది. చాలా ప్రశాంతంగా...నిశ్చలంగా...నిర్మలంగా... ❀

## అమీషా ప్లాన్

సహజంగా అమీషా పటేల్ పార్టీలకు చాలా తక్కువగా ఎటెండ్ అవుతూ ఉంటుంది. అదేమంటే 'నేను పార్టీ గర్ల్‌ను కాను' అని అంటుంది. కానీ గత కొన్నాళ్ళ క్రితం అమీషా పార్టీలను అసహ్యించుకోవడం మానేసి స్వయంగా పార్టీలు ఇవ్వడం మొదలుపెట్టింది. సినిమాలన్నీ ఫ్లాప్ అవుతున్న సందర్భంలో ఈ విధంగా పార్టీలు ఇవ్వడానికి కారణం డిమాండ్‌లేని బాలీవుడ్ హీరోయిన్లు పార్టీలకు అటెండ్ అవుతుంటారు లేదా పార్టీలు ఇస్తుంటారు. ఇండస్ట్రీలో తమ ఉనికిని చాటుకోవడానికే ఇలా చేస్తుంటారని బాలీవుడ్ భోగట్టా.

